

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

గురువారం 29-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :131 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

తెలంగాణలో భారీగా ఐఏఎస్ బదిలీలు!



2 లో

- 12 మంది ఐఏఎస్‌లకు స్థానచలనం
- కీలక శాఖలకు కొత్త అధికారులు
- జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ
- వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ
- నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్
- రాహుల్ బొజ్జాకు అదనపు బాధ్యతలు

కరువు జాబితాపై బండి సంజయ్ ఫైర్!

- కరీంనగర్‌కు తీవ్ర అన్యాయం
- 35 శాతం లోటు వర్షపాతం ఉన్నా మినహాయింపు
- అశాస్త్రీయ ఎంపికపై ప్రశ్నలు
- కరువు గణాంకాలు బహిర్గతం చేయాలి
- రైతుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవాలి
- అర్హత ఉన్న మండలాలను చేర్చాలి
- రైతులకు అన్యాయం చేస్తే పరిణామాలు తప్పవు



న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): కరువు మండలాల జాబితాపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధిక లోటు వర్షపాతం ఉన్న చాలా మండలాలు జాబితాలో లేవు. మొక్కుబడిగా మండలాల జాబితాను ప్రకటించారు.. కరువు మండలాల ప్రకటనపై ఇంత వివక్ష ఎందుకు? అని ప్రశ్నించారు. అశాస్త్రియంగా వీటి ఎంపిక చేసినట్లు జాబితా చూస్తేనే అర్థమవుతుందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ మేరకు తాజాగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.
2 లో

పాక్‌కు రహస్యాలు.. ఇద్దరు అరెస్ట్!

- ఆపరేషన్ ఫైర్‌వాల్-2 ప్రారంభం
- నకిలీ ఖాతాలతో గూఢచర్యానికి వల
- హనీట్రాప్‌తో కీలక సమాచార సేకరణ
- రక్షణ సంస్థలే లక్ష్యంగా నెట్‌వర్క్
- వాట్సాప్ ఓటీపీలతో అనుమానాస్పద కార్యకలాపాలు
- క్రిప్టో చెల్లింపుల ద్వారా నగదు బదిలీలు 2 లో
- పలు రాష్ట్రాలకు విస్తరించిన గూఢచర్య నెట్‌వర్క్

కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్!

- నాలుగు కీలక నిర్ణయాలకు కేంద్రం ఆమోదం
- కంటైనర్ తయారీ రంగానికి రూ.10,000 కోట్లు
- క్రీడా వస్తువుల పరిశ్రమకు రూ.1,856 కోట్లు
- గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్లు
- డీఏ, డీఆర్ కోసం రూ.10,016 కోట్లు
- మొత్తం రూ.29,267 కోట్ల కేటాయింపు


2 లో

కంటైనర్ తయారీ రంగానికి రూ.10,000 కోట్లు

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కంటైనర్ తయారీ రంగం, క్రీడా వస్తువుల పరిశ్రమ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యం (డీఏ), పెన్షనర్ల కరువు సహాయ భత్యం (డీఆర్) కోసం నిధులు కేటాయించింది. ఈ నాలుగు నిర్ణయాలకు కలిపి మొత్తం రూ.29,267 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది.

దేశంలో కంటైనర్ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. ఈ రంగంలో ఉత్పత్తిని పెంచడం, తయారీ కార్యకలాపాలకు ఊతమివ్వడం లక్ష్యంగా రూ.10,000 కోట్లు కేటాయించింది. ఈ పథకం ద్వారా దేశీయ తయారీ రంగానికి ప్రోత్సాహం లభించనుంది.

ఇండియా కూటమి ర్యాలీకి అనుమతి!

- నవంబర్ 1న ఢిల్లీలో నిరసన
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు
- రాత్రి బసకు అనుమతి నిరాకరణ
- ఇతర ప్రాంతాల్లో ప్రదర్శనలకు నో
- సీసీటీవీలతో పోలీసుల నిఘా
- తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు 2 లో

యోగికి దెబ్బ.. ఎస్పీకి విజయం!

- యోగికి షాక్ ఇచ్చిన అఖిలేష్ పార్టీ
- 4,898 ఓట్ల తేడాతో బీజేపీపై గెలుపు
- పట్టభద్రుల స్థానంలోనూ ఎస్పీ ఆధిక్యం
- ఐదు స్థానాల్లో బీజేపీ విజయం
- 11 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- 2027 ఎన్నికలపై ఫలితాల ప్రభావం 2 లో

ఫార్ములా ఈ-రేస్ కేసులో బిగ్ ట్విస్ట్



2 లో

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన 'ఫార్ములా ఈ రేస్' నిధుల మళ్లింపు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.



తుఫాన్ టెన్షన్ చంద్రబాబు యాక్షన్!

- నాలుగుసార్లు సమీక్ష.. సీఎం ఫోకస్
- కోనసీమలో 33 వేల కొబ్బరి చెట్లు నేలమట్టం
- ఎన్‌హెచ్-16పై క్లియర్.. మిగతా చోట్ల పనులు
- విద్యుత్ పునరుద్ధరణకు స్పీడ్ పెంచాలి
- వ్యవసాయం నుంచి ఇళ్ల వరకు.. నష్టం అంచనా
- గత తుఫానుల అనుభవంతో విపత్తులపై పట్టు
- డేటా ఆధారంగా తక్షణ నిర్ణయాలు
- సాధారణ స్థితి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలి

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): అర్నబ్ తుఫాన్ ప్రభావం, సహాయక చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారులపై కూలిన చెట్ల తొలగింపు పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి సమీక్ష నిర్వహించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి అధికారులతో పరిస్థితులను సమీక్షించారు. కలెక్టర్లతో మరోసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలవారీగా తుఫాన్ ప్రభావం, సహాయక చర్యల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత రాత్రి నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాన్ పరిస్థితులను, సహాయక చర్యలను సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

ఆరు జిల్లాల్లో అధిక వర్షపాతం

గత 24 గంటల్లో నమోదైన వర్షపాతం, జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకి వివరించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కోనసీమ జిల్లాలో సుమారు 33 వేల కొబ్బరి చెట్లు పడిపోయినట్లు తెలిపారు.

మిగతాది 2 లో..

ఇన్‌స్టా పోస్టులపై కేంద్రానికి అభిజీత్ కౌంటర్!


2 లో

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): దేశవ్యాప్తంగా సోషల్ మీడియా పోస్టులపై అప్రకటిత ఆంక్షలు అమలవుతున్నాయని దేశవ్యాప్తంగా పలువురు నెటిజన్లు ఆరోపిస్తున్న వేళ 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించే వేలాది పోస్టులు, ఖాతాలను ప్రతిరోజూ బలవంతంగా తొలగింపజేస్తున్నారని ఆయన బుధవారం ఉదయం సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇన్‌స్టాగ్రామ్‌లో విమర్శలను అణచివేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రభుత్వం ప్రతిరోజూ వేలాది పోస్టులు, అకౌంట్లను తొలగిస్తోంది, కానీ వారు ఒక ప్రధాన విషయాన్ని విస్మరిస్తున్నారు.

ఓటమిని గౌరవిస్తాం :డీకే శివకుమార్!


2 లో

- నాలుగు స్థానాల్లో ఎన్డీయే క్లీన్‌స్వీప్
- ఓటర్ల నుంచి స్పష్టమైన సందేశం
- ఓటమికి కారణాలపై సమీక్ష
- విపక్షాల విమర్శలకు కౌంటర్
- ఉప ఎన్నికల ఫలితాలనూ చూడాలి
- అభివృద్ధి ఎజెండాతో ముందుకు సాగుతాం

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు జీరో!

- 28 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ
- కర్ణాటకలోనూ కాంగ్రెస్‌కు భంగపాటు
- సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్
- యూపీలో ఎస్పీ, బీజేపీ మధ్య పోటీ
- బీహార్‌లో పలు పార్టీలకు విజయాలు
- మహారాష్ట్రలో ఎన్డీయే అధిక్యం
- కాంగ్రెస్‌కు దేంజర్ బెల్స్


2 లో

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర్ ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటకలో ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. అధికారంలో ఉన్న కర్ణాటకలో దారుణంగా దెబ్బతింది. సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానాన్ని కూడా కోల్పోవడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ బీజేపీ-జేడీఎస్ కూటమి 4 ఎమ్మెల్సీలను కైవసం చేసుకుంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 29-10-2026

పాక్‌కు రహస్యాలు.. ఇద్దరు అరెస్ట్!



న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): దేశ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న గూఢచర్య నెట్‌వర్క్‌పై ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇప్పటికే 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' పేరుతో చేపట్టిన దర్యాప్తులో కీలక ఆధారాలను గుర్తించిన అధికారులు.. తాజాగా 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2'ను ప్రారంభించారు. ఈ కేసులో దేశ భద్రతకు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నారనే ఆరోపణలపై ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సమాచారం.

నకిలీ ఖాతాలు.. హనీట్రాప్‌తో వల:

'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' దర్యాప్తులో భాగంగా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లు నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, హనీట్రాప్‌లు, అసభ్యకరమైన ప్రతిపాదనల ద్వారా వ్యక్తులను లక్ష్యంగా చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ విధంగా పరిచయాలు పెంచుకుని, రక్షణ రంగానికి సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. విశాఖపట్నంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న కీలక రక్షణ సంస్థలు, వ్యూహాత్మక ప్రాంతాల సమాచారాన్ని సేకరించడమే ఈ నెట్‌వర్క్ లక్ష్యంగా ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.

వాట్సాప్ ఓటీపీలు.. క్రిప్టో చెల్లింపులు

ఈ గూఢచర్య కార్యకలాపాల కోసం భారతీయ మొబైల్ నంబర్లకు సంబంధించిన ఓటీపీలను ఉపయోగించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. హ్యాక్ చేసిన స్థానిక నెట్‌వర్క్‌ల సాయంతో విదేశీ ఏజెంట్లు వాట్సాప్ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేందుకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. మరోవైపు, ఈ కార్యకలాపాలకు సంబంధించిన చెల్లింపులను విదేశీ క్రిప్టోకరెన్సీ బదిలీలు, స్థానిక వ్యాపారుల ద్వారా మళ్లించినట్లు అనుమానిస్తున్నారు. ఈ గూఢచర్య నెట్‌వర్క్ కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా దేశంలోని పలు రాష్ట్రాలకు సైతం విస్తరించి ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న అధికారులు తాజాగా ఆపరేషన్ ఫైర్‌వాల్-2లో భాగంగా మరో ఇద్దరిని అరెస్టు చేయడం హాట్ టాపిక్?గా మారింది. అయితే ఈ 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2 కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఫార్ములా ఈ-రేస్ కేసులో బిగ్ ట్విస్ట్

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాస్‌పోర్ట్‌కు సంబంధించి రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీస్ జారీ చేసిన నోటీసులపై స్పందించిన తెలంగాణ హైకోర్టు 'స్టేటస్ కో' (యథాతథ స్థితి) పాటిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి విచారణ వేగవంతం చేసిన యాంటీ కరప్షన్ బ్యూరో అధికారులు, కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాల్సిందిగా రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసుకు లేఖ రాశారు. ఏసీబీ విజ్ఞప్తి ఆధారంగా కేటీఆర్‌కు పాస్‌పోర్ట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. పాస్‌పోర్ట్ అధికారులు ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ వెంటనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. పాస్‌పోర్ట్ నోటీసుల వ్యవహారంలో స్టేటస్ కో ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది. అంతేకాకుండా, ఈ కేసులోని ప్రతివాదులైన ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు నిర్ణయంతో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట లభించినట్లయింది.

ఇన్‌స్టా పోస్టులపై కేంద్రానికి అభిజీత్ కౌంటర్!

మొదటి పేజీ తరువాయి

ఇన్‌స్టాగ్రామ్ అనేది ప్రజలు తమ ప్రశ్నలను లేవనెత్తే ఒక వేదిక మాత్రమేనన్నారు. ఆ ప్రశ్నల వెనుక ఉన్న అసలు కారణాలు సోషల్ మీడియాకు ఆవల నిజ జీవితంలో ఉన్నాయని, అందువల్ల ఖాతాలను తొలగించినంత మాత్రాన ఆ సమస్యలు మాయమైపోవంటూ అభిజీత్ విమర్శించారు. ఈ రకమైన సెన్సార్‌షిప్ వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉన్న విశ్వసనీయత దెబ్బతింటుందని ఇది మరింత అపనమ్మకాన్ని పెంచుతుందని హెచ్చరించారు.

మండిపడుతున్న యూజర్లు:

ఇన్ స్టా పోస్టులు అడ్డుకుంటున్నారంటూ ఇప్పటికే సీజేపీ నేత అశుతోష్ రంకా, యూట్యూబర్ ధృవ్ రాఠీ సైతం కేంద్రంపై విమర్శలు గుప్పించారు. కాక్రోచ్ పార్టీ నేతల వాట్సాప్ అకౌంట్లు కూడా బ్లాక్ అవుతున్నాయని, మెసేజ్ లు పంపకుండా అడ్డుకుంటున్నారని సీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇక కోర్టుల వార్తల్ని ప్రచురించే లైవ్ లా వెబ్ సైట్ కు చెందిన ఇన్ స్టా పేజ్ లో పోస్టు చేసిన ఈసీ విధుల పోస్టును కూడా తొలగించారని ధృవ్ రాఠీ ఆరోపించారు. కేవలం సీజేపీ నేతలే కాకుండా పలువురు స్వతంత్ర విమర్శకులు, ప్రముఖులు కూడా తమ పోస్టులు ఇన్‌స్టాగ్రామ్ నుండి తొలగించబడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు 'వికసిత్ భారత్ 2047' హేమీపై తాను రాసిన ఒక వ్యంగ్య కవితకు సంబంధించిన మ్యూజికల్ పోస్టును ఇన్‌స్టాగ్రామ్ తొలగించిందని హాస్య రచయిత, గేయ రచయిత వరుణ్ గ్రోవర్ ఆయన తెలిపారు. భారత ఐటీ చట్టం కింద వచ్చిన చట్టపరమైన అభ్యర్థన మేరకు ఈ పోస్టును నిరోధించినట్లు ఇన్‌స్టాగ్రామ్ పంపిన నోటీసు స్క్రీన్‌షాట్‌ను ఆయన పంచుకున్నారు. అప్రకటితంగా ఇన్ స్టా పోస్టులు,ఖాతాలు బ్లాక్ అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్న వేళ ఈ ఆరోపణలపై కేంద్రం ఎలా రియాక్ట్ కాబోతోంది అనేది ఉత్కంఠగా మారింది.

ఇండియా కూటమి ర్యాలీకి అనుమతి!



న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): కేంద్ర ఎన్నికల సంఘం వైఖరి, విధానాలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ తలపెట్టిన విషయం తెలిసిందే. ఈ ర్యాలీకి ఢిల్లీ పోలీసులు షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కఠిన నిబంధనలను విధించిన పోలీసులు.. సభను ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటలలోపే ఎట్టిపరిస్థితుల్లోనూ ముగించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. నిర్దేశిత సమయం ముగిసిన వెంటనే మైదానాన్ని ఖాళీ చేయాలని, రాత్రి వేళల్లో రాంలీలా మైదానంలో ఎవరూ బస చేయడానికి అనుమతి లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే ర్యాలీ ముగిసిన అనంతరం నాయకులు గానీ, కార్యకర్తలు గానీ ఢిల్లీలోని ఇతర ప్రాంతాలు, సున్నితమైన వీధుల్లో ఎలాంటి పాదయాత్రలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని గట్టి ఆంక్షలు విధించారు.

కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా కోసం మైదానం పరిసర ప్రాంతాల్లో తగినన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణ బాధ్యతలను సమన్వయం చేసుకోవాలని పోలీసు శాఖ నిర్వాహక కమిటీని ఆదేశించింది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రతిపక్ష శ్రేణులు తరలివచ్చే అవకాశమున్నందున మైదానంలో తాగునీటి సౌకర్యం, మొబైల్ మరుగుదొడ్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రజా రద్దీని నియంత్రించేందుకు, శాంతియుతంగా సభ ముగిసేందుకు తగిన సంఖ్యలో స్వచ్ఛంద సేవకులను (వాలంటీర్లను) రంగంలోకి దించాలని పేర్కొంటూ.. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగికి దెబ్బ.. ఎస్పీకి విజయం!



న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): ఉత్తర ప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యోగికి బిగ్ షాక్ తగిలింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో అఖిలేష్ యాదవ్ సమాజ్ వాదీ పార్టీ విజయం సాధించింది. ప్రధాని మోడీ సొంత నియోజకవర్గం వారణాసిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని సమాజ్ వాదీ పార్టీ కైవసం చేసుకుంది. మరోవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలోనూ ఎస్పీ ఆధిక్యంలో ఉంది. అంతేకాకుండా ఆగ్రా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం ఏస్పీనే కైవసం చేసుకుంది. ఇక రాష్ట్రంలో బీజేపీ మొత్తం ఐదు స్థానాలను గెలుచుకుని ఒక స్థానంలో ఆధిక్యంలో ఉన్నటికీ రెండు స్థానాల్లో ఎస్పీ విజయం సాధించడం, ఒకస్థానంలో ఆధిక్యంలో ఉండటంతో ఆ పార్టీకి ఊహించని షాక్ తగిలింది.

వారణాసి ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానంలో ఎస్పీకి చెందిన లాల్ బిహారీ యాదవ్, బీజేపీకి చెందిన ప్రమోద్ కుమార్ మిశ్రాను 4,898 ఓట్ల తేడాతో ఓడించారు. వారణాసి గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కేదార్ నాథ్ సింగ్ పై సమాజ్ వాదీ పార్టీకి చెందిన అశుతోష్ సిన్హా విజయం దిశగా దూసుకుపోతున్నారు. మరోవైపు బీజేపీ లక్నో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ, మీరట్-సహారన్ పూర్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ, బరేలీ-మొరాదాబాద్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ, మీరట్-సహారన్ పూర్ పట్టభద్రుల నియోజకవర్గాలతో పాటు మరో స్థానాన్ని బీజేపీ గెలుచుకుంది. యూపీలో మొత్తం 11 శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజా ఫలితాలు 2027 అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్ బదిలీలు!

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులకు బదిలీలు, అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. జయేష్ రంజన్ ను పర్యావరణ, అటవీ, సైన్స్-టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. వికాస్ రాజ్?కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, నవీన్ మిట్టల్ ను పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, వాణీ ప్రసాద్ క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, శైలజా రామయ్యర్ ను దేవాదాయ శాఖ స్పెషల్ సీఎస్?గా నియమించారు.

రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. కె.ఇలంబర్తికి రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శిగా, ప్రస్తుతం హెచ్ఎండీఏ కమిషనర్ గా ఉన్న సర్ఫరాజ్ అహ్మద్?కు కోర్ అర్బన్ రీజియన్ స్పెషల్ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలు, శృతి ఓజాకు మహిళా సంక్షేమం, ఎస్సీ శాఖ స్పెషల్ సెక్రటరీగా, వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ గా ముషారఫ్ అలీ, ఎస్. సంగీత సత్యనారాయణ ను మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ గా, ఎస్పీడీసీఎల్ ఎండీ జితేశ్ పాటిల్ కు టీజీ రెడ్కో వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఓటమిని గౌరవిస్తాం: డీకే శివకుమార్!

న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): కర్ణాటక శాసన మండలి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి నాలుగు స్థానాలను కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేయడం సంచలనంగా మారింది. తాజాగా వెలువడిన ఈ ఫలితాలపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హుందాగా స్పందించారు. శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు ఇచ్చిన తీర్పును తాము శిరసావహిస్తూ గౌరవంగా స్వీకరిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గతంలో ఒక స్థానం ఉండేదని, ఆ స్థానంలో తప్పక విజయం సాధిస్తామని భావించామని.. అయితే ఓటర్లు తమకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారని పేర్కొన్నారు. ఫలితాలను సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పరాజయం ఎదురైనప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థులకు గణనీయమైన సంఖ్యలోనే ఓట్లు వచ్చాయని, పార్టీ శ్రేణులతో కలిసి ఓటమికి గల కారణాలపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని సీఎం స్పష్టం చేశారు.

మరోవైపు ఈ మండలి ఎన్నికల ఫలితాలు రాబోయే సార్వత్రిక ఎన్నికలకు దిక్సూచి అంటూ విపక్షాలు చేస్తున్న విమర్శలను డీకే శివకుమార్ గట్టిగా తిప్పికొట్టారు. మండలి ఉపఎన్నికల ఫలితాలే భవిష్యత్ రాజకీయాలకు ప్రామాణికమైతే.. ఇటీవల చన్నపట్న, షిగ్గావ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఉపఎన్నికల ఫలితాలు కూడా రాబోయే ఎన్నికలకు సంకేతాలుగానే పరిగణించాలి కదా అని ఆయన ప్రతిపక్షాలను నేరుగా ప్రశ్నించారు. కేవలం తమకు అనుకూలమైన ఫలితాలు వచ్చినప్పుడు మాత్రమే మాట్లాడటం కాదని, చన్నపట్న, షిగ్గావ్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు గురించి కూడా విపక్ష నేతలు మాట్లాడాలని ఆయన హితవు పలికారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి ఎజెండా తోనే తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు జీరో!



న్యూస్ డెస్క్, 28 అక్టోబర్ (ఇది కద నిజం): నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర్ ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటకలో ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. అధికారంలో ఉన్న కర్ణాటకలో దారుణంగా దెబ్బతింది. సిట్టింగ్ ఎమ్మెల్యే స్థానాన్ని కూడా కోల్పోవడం ఆ పార్టీ పరిస్థితికి అద్దం పడుతోంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ బీజేపీ-జేడీఎస్ కూటమి 4 ఎమ్మెల్సీలను కైవసం చేసుకుంది.

కర్ణాటక:

కర్ణాటక ఫలితాలు కాంగ్రెస్‌కు అతిపెద్ద ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం ఘోరంగా ఓడిపోయింది. నాలుగు ఎమ్మెల్యే స్థానాలు కోల్పోయింది. దీంతో బెంగళూర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్, కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పుట్టన్నపై విజయం సాధించారు. గతంలో కాంగ్రెస్ ఆధీనంలో ఉన్న ఈ స్థానం ఇప్పుడు ఎన్డీయే కూటమిలో చేరింది. మిగిలిన నార్త్ ఈస్ట్ టీచర్స్, వెస్ట్ గ్రాడ్యుయేట్స్, సౌత్ ఈస్ట్ గ్రాడ్యుయేట్స్ సీట్లను బీజేపీ కైవసం చేసుకుంది.

ఉత్తర్ ప్రదేశ్, బీహార్, మహారాష్ట్రల్లో కాంగ్రెస్‌కు "జీరో"..

కర్ణాటకతో పాటు యూపీ, బీహార్, మహారాష్ట్రల్లో కూడా కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. యూపీలో 11 ఎమ్మెల్సీ స్థానాలు ఉంటే బీజేపీ, సమాజ్‌వాదీ(ఎస్పీ) మధ్య పోటీ నెలకొంది. మీరట్, బరేలీ-మొరాదాబాద్, లక్నో స్థానాలను బీజేపీ నిలబెట్టుకుంది. వారణాసి టీచర్స్, ఆగ్రా టీచర్స్ స్థానాల్లో ఎస్పీ విజయం సాధించింది. మిగిలిన స్థానాల ఫలితాలు తేలాల్సి ఉంది.

బీహార్‌లో 8 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగగా, నాలుగు ఉపాధ్యాయ స్థానాలను ఆర్‌జేడీ (పాట్నా), బీజేపీ (తిర్హుత్), జన్ సూరజ్ (దర్భంగా), ఒక స్వతంత్ర అభ్యర్థి (శరణ్) గెలుచుకోగా, పాట్నా గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి జేడీయూ అభ్యర్థి నీరజ్ కుమార్ విజయం సాధించారు.

మహారాష్ట్రలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే అధికార మహాయుతి కూటమి, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ బీజేపీ, శివసేన, శరద్ పవార్ ఎన్సీపీలు పలు స్థానాల్లో ఆధిక్యత కనబరుస్తున్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఆధిక్యతను కనబరుస్తోంది.

కాంగ్రెస్‌కు డేంజర్ బెల్స్..

కాంగ్రెస్ పార్టీకి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక డేంజర్ సిగ్నల్‌గా భావించాలి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సమయంలోనే ఈ ఫలితాలు వెలువడ్డాయి. ప్రతీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈవీఎంలపై నిందలు వేసే కాంగ్రెస్ నాయకులు, బ్యాలెట్ పేపర్స్ ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం చతికిలపడ్డారు. అధికారంలో ఉన్న కర్ణాటకలో కూడా ఒక్క ఎమ్మెల్సీ సీటు కూడా గెలుచుకోలేకపోవడం సంచలనంగా మారింది.

కరువు జాబితాపై బండి సంజయ్ ఫైర్!

మొదటి పేజీ తరువాయి

35శాతం లోటు వర్షపాతం ఉన్న మండలాలు కూడా కరువు జాబితాలో లేకపోవడం బాధాకరమన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల్లో అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నా కన్పించడం లేదా? అని నిలదీశారు. పొలాలన్నీ బీళ్లుగా మారి తాగునీటికి ఇబ్బంది పడుతుంటే పట్టించుకోరా? అని ప్రశ్నించారు.

క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడితే పరిస్థితి తెలుస్తుందని బండి సంజయ్ అన్నారు. "నిధులు ఖర్చు చేయాల్సి వస్తుందని కరీంనగర్ పార్లమెంట్ ను విస్మరించారా?కరీంనగర్ పార్లమెంటు పరిధిలో అత్యధిక మండలాలు కరువు జాబితాలోకి వచ్చే అర్హత ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో వర్షపాతం, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితిని ఒకే ప్రమాణాలతో పరిశీలించారా? కరువు మండలాలను ఎంపిక చేయడానికి ఉపయోగించిన అధికారిక గణాంకాలు, ప్రామాణికాలు ఏమిటి? కరువు జాబితాలో లేని మండలాల్లో పంట నష్టం, నేలలో తేమ, భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించారా? కరువు మండలాలుగా గుర్తించని ప్రాంతాల రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్నారా? రాష్ట్ర సగటు వర్షపాతాన్ని మాత్రమే కాకుండా, ప్రతి మండలంలోని వర్షపాతం, పంటల పరిస్థితిని విడివిడిగా పరిశీలించారా? ఒక మండలంలో వర్షం కురిసిందని, పక్క మండలంలోనూ అదే పరిస్థితి ఉందని భావించడం శాస్త్రీయ పద్ధతి కాదు.. కరువు మండలాల గుర్తింపునకు ఉపయోగించిన గణాంకాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలి.. ప్రతి మండలానికి సంబంధించిన వర్షపాతం లోటు, పంటల పరిస్థితి, సాగు విస్తీర్ణం, నేలలో తేమ, భూగర్భ జలాల వివరాలను వెల్లడించాలి.. సర్వేలో మినహాయించిన గ్రామాలు లేదా మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించాలి.. అర్హత ఉన్న మండలాలు మినహాయించబడినట్లు తేలితే, నిబంధనలకు అనుగుణంగా వాటిని జాబితాలో చేర్చాలి.. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి వాస్తవికత ఆధారంగా కరువు మండలాలను ప్రకటించాలి.. కరువు ప్రభావిత రైతులకు అర్హత మేరకు సహాయక చర్యలు అందించాలి.. పేదలకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించాలి.. రైతులు, పేదలకు అన్యాయం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవు." అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

తుఫాన్ టెన్షన్.. చంద్రబాబు యాక్షన్!

మొదటి పేజీ తరువాయి

ఇదే జిల్లాలో సుమారు 10 వేల ఇతర చెట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 4 వేల చెట్లు కూలిపోయినట్లు వివరించారు.

జాతీయ రహదారి-16పై చెట్ల తొలగింపు పూర్తి

తుఫాన్ కారణంగా వివిధ ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారి-16పై కూలిన చెట్లను వెంటనే తొలగించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇతర ప్రాంతాల్లోనూ చెట్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయని, మధ్యాహ్నం 3 గంటల నాటికి ఈ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాలు మినహా మిగిలిన తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని వెల్లడించారు.

విద్యుత్ పునరుద్ధరణను వేగవంతం చేయాలి

తుఫాన్ సహాయక చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం ఏపీసీపీడీసీఎల్ నుంచి కూడా సిబ్బందిని పంపించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. రహదారులపై కూలిన చెట్లను వెంటనే తొలగించి సాయంత్రంలోగా అన్ని జిల్లాల్లో రహదారులను పూర్తిస్థాయిలో క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు విద్యుత్, తాగునీరు, రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

తుఫాన్ నష్టంపై సమగ్ర అంచనాలు

తుఫాన్ కారణంగా వ్యవసాయం, ఉద్యానవన రంగాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సంబంధిత శాఖల అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పశుసంపదకు జరిగిన నష్టం, ఇళ్లు కూలిపోవడం, నీట మునగడం వల్ల కలిగిన నష్టాన్ని కూడా అంచనా వేయాలని సూచించారు. విద్యుత్ వ్యవస్థలు, రహదారులకు జరిగిన నష్టంతోపాటు చెరువులకు గండ్లు పడిన అంశాలపై క్షేత్రస్థాయి నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. నష్టానికి సంబంధించిన వివరాలను సంబంధిత శాఖలు సమన్వయంతో సేకరించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.. మరోవైపు.. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలోకి వస్తున్న నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులకు చెప్పారు.. సీసీటీవీ కెమెరాల ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతోపాటు వరద నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, రహదారులపై రాకపోకలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

గత తుఫానుల అనుభవాలతో విపత్తుల నిర్వహణ

గత పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని 26 తుఫాన్లు తాకాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో సంభవించిన దివిసీమ ఉప్పెనలో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని గుర్తుచేశారు. దివిసీమ ఉప్పెన, హుద్‌హుద్, తిత్లీ తుఫాన్ల సమయంలో పెనుగాలులు తీవ్ర ప్రభావం చూపాయని తెలిపారు. గతంలో వరదల సమయంలో అప్పటి ప్రభుత్వ వైఖరి కారణంగా వ్యవస్థలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. బుడమేరు వరదల సమయంలో విజయవాడలోనే ఉండి పరిస్థితులను చక్కదిద్దగలిగామని పేర్కొన్నారు. ప్రస్తుతం అర్నబ్ తుఫాన్ సమయంలో గంటకు 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని తాకిన ప్రతి తుఫాన్ నుంచి ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనే పాఠాలను నేర్చుకుంటున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించగలుగుతున్నామని వివరించారు చంద్రబాబు..

క్షేత్రస్థాయి సమాచారంతో తక్షణ నిర్ణయాలు

అన్ని స్థాయిల్లోని అధికారులు ఒకే విధమైన ఆలోచనతో పనిచేయాలని, అందుబాటులో ఉన్న సమాచారాన్ని, డేటాను విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారానికి అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకుని వాటిని సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాన్ ప్రభావం నుంచి ప్రజలను కాపాడేందుకు, వారు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి చేరుకునే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

కేంద్ర కేబ

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 29-10-2026





రిజర్వేషన్ లే భవిష్యత్ తరాలకు మనమిచ్చే ఆస్తి

- జనగణనలో ఓబీసీ కాలమ్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- ఓబీసీ కాలమ్ పెట్టకపోతే తెలంగాణలో జనగణనను అడ్డుకోవాలి
- రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ సర్కారు కుట్ర
- ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఐక్య పోరాటాలతో ఈ కుట్రను అడ్డుకోవాలి
- హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్ సభలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ ఇది కద నిజం:

రిజర్వేషన్ లే భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే ఆస్తి అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్, తెలంగాణ బీసీ రైట్స్ ఫోరమ్ సంయుక్తంగా బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తమిళనాడు ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలోనూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. కేంద్రం అందుకు అంగీకరించకపోతే తెలంగాణలో జనగణనను నిర్వహించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జనగణనలో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ తో పాటు డ్రాప్ డౌన్ బాక్స్ ఉండాల్సిందేనని చెప్పారు. ఇందుకోసం పార్టీలకు అతీతంగా అందరం కలిసి పోరాటం చేయాల్సి ఉందన్నారు. జనగణన కోసం కేంద్రం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తుందని.. ఇంత ఖర్చు చేసి కూడా ఓబీసీల లెక్క ఎంత ఉందో తేల్చకపోవడం సరికాదన్నారు. జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని డిమాండ్ చేస్తూ నవంబర్ లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఓబీసీ సంఘాలు నిర్వహించే ధర్నాలో తాము పాల్గొంటామని ప్రకటించారు. మహిళ బిల్లు కోసం తాము ఢిల్లీలో పోరాడి విజయం సాధించామని.. ఇప్పుడు ఓబీసీల అంశంలోనూ అదే తరహాలో ఉద్యమించి కేంద్రం మెడలు వంచి జనగణనలో ఓబీసీల కోసం ప్రత్యేక కాలమ్ పెట్టేలా చేస్తామన్నారు.

అసెంబ్లీలో తీర్మానం చేయాలి

కుల గణనలో ఓబీసీ కాలం చేర్చే విధంగా కేంద్రంపై తమిళనాడు తరహాలో ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని అన్నారు. అక్కడి ప్రభుత్వం ఇందుకోసం అసెంబ్లీలో తీర్మానం చేసినట్టే మనం కూడా చేయాల్సి ఉందన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేకంగా అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. బీసీల విషయంలో రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే హామీని నిలబెట్టుకోవాలని తాము ఉద్యమిస్తేనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. కానీ ఆ బిల్లు కేంద్రం వద్ద ఆగిపోయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. బీసీ బిల్లుకు ఆమోదం కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని సీఎం ప్రకటించారని.. ఆ తర్వాత సీఎం ఢిల్లీకి 30 సార్లకు పైగా వెళ్లినా అఖిలపక్షాన్ని మాత్రం తీసుకెళ్లలేదని చెప్పారు. జనగణనలో బీసీ కుల గణన అంశంలోనైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒక్కటి కావాల్సిన అవసరముందన్నారు. కేంద్రం మన డిమాండ్ కు ఒప్పుకోకపోతే రాష్ట్రంలో జనగణన చేపట్టకుండా అడ్డుకోవాలని.. ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ విషయంలో రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ ప్రభుత్వానికి సహకరిస్తారని అన్నారు.

రిజర్వేషన్లు తీసేసే కుట్ర

కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ కు రిజర్వేషన్లంటే గిట్టదని.. ఇప్పుడున్న రిజర్వేషన్లనే తీసేసే కుట్ర చేస్తున్నారని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కుల గణనలో ఓబీసీ ల లెక్క తేలితే వారి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందని కావాలనే ప్రత్యేక కాలమ్ పెట్టటం లేదని చెప్పారు. బీసీ కులాలకు సంబంధించి ఒకే రాష్ట్రంలో ఒకే కులానికి నాలుగైదు పేర్లు ఉంటాయని.. ఇక దేశ వ్యాప్తంగా అయితే చాలా పేర్లుంటాయని చెప్పారు. అలాంటి పేర్లున్న కులాల జనాభా మొత్తాన్ని ఒకే కులం జనాభాగా చూపించాలన్నారు. లేదంటే బీసీల కులాల జనాభా తక్కువగా ఉండే పరిస్థితి వస్తుందన్నారు. రిజర్వేషన్లను దక్కించుకోవాలంటే ఎస్సీ, ఎస్టీ లతో కలిసి అందరం పోరాటం చేయాలన్నారు. బీసీల పోరాటంలో ఎస్సీ, ఎస్టీలను కలుపుకొని పోవటమేమిటంటూ కొందరు వింతగా మాట్లాడుతుండటం సరికాదని చెప్పారు. రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే కచ్చితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కలిసికట్టుగా పోరాటం చేయాల్సి ఉంటుందన్నారు. దేశ ప్రధాని మోడీ పేరుకు మాత్రమే ఓబీసీ అని..ఆయన ఓబీసీల కోసం చేసిందేమీ లేదన్నారు. కనీసం మనల్ని లెక్క పెట్టని వాళ్లు మనకు అధికారం ఇస్తారా? అని ప్రశ్నించారు.

రిజర్వేషన్లే భవిష్యత్ తరాలకు మనమిచ్చే ఆస్తి

భవిష్యత్ తరాలకు మనమిచ్చే అమూల్యమైన ఆస్తి రిజర్వేషన్లేనని కవిత అన్నారు. భూములు, బంగారం ఉంటే ఒకటి రెండు తరాలకు మాత్రమే ఉంటాయని.. కానీ రిజర్వేషన్లు తరతరాలకు మేలు చేస్తాయన్నారు. బీసీల లెక్క తెలియకపోవటంతోనే వారికి అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ దేశ బడ్జెట్ ఏడాదికి రూ. 50 లక్షల కోట్లు ఉంటే ఏటా బీసీలకు రూ. 2 వేల కోట్లు కూడా ఖర్చు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంటే ఒక్కో మనిషికి కనీసం ఒక్క బఠాణీ కూడా రాదన్నారు. అందుకే మన వాటా కోసం మనం దఫాదఫాలుగా పోరాటం చేయాలన్నారు. ముందుగా ఓబీసీల లెక్క తేలితే ఆ తర్వాత మన వాటా హక్కుల కోసం పోరాటం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం ఆమోదం తెలిపి ఉంటే రేవంత్ రెడ్డి ఇచ్చానని చెప్పుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగాల్లో సగం బీసీలకే వచ్చేవని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల్లో లక్ష బీసీలకే వచ్చేవని అన్నారు. బీసీల జనాభా ఎంత ఉందో లెక్కలు తేల్చకపోవడంతోనే వారికి అన్యాయం జరుగుతుందని చెప్పారు.

రామ్ మనోహర్ లోహియా, కాన్షీరాం, కర్పూరీ ఠాకూర్, మూలాయం సింగ్ లాంటి ఎందరో బీసీల కోసం ఎంతో పోరాటం చేశారని.. అదే విధంగా జగదేవ్ ప్రసాద్ కుశ్వా లాంటి నాయకులు బీసీల కోసం ఎంతో కష్టపడ్డారని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్ కు 4 రోజులు మాత్రమే డిప్యూటీ సీఎంగా ఉన్న జేపీ కుశ్వా బీసీల కోసం పోరాటం చేశారని.. ఆయనను పోలీసులు కాల్చి చంపారని తెలిపారు. వందలో 90 శాతం మంది అన్యాయానికి గురువుతారన్నారని.. వారికి న్యాయం చేయాలని ఆయన పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ దేశంలో 100 మంది అవకాశాలను 10 మంది మాత్రమే అనుభవిస్తూ మిగతా వారికి అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితి పోవాలంటే పోరాటం చేయాల్సిందేనని కవిత చెప్పారు.

కవిత తెచ్చే సైక్లోన్ తో మోడీ కుర్చీ ఊడటం ఖాయం : ప్రొఫెసర్ సూరజ్ మండల్

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత తెచ్చే సైక్లోన్ తో ఓటు చోరీతో పాటు ఓబీసీలకు అన్యాయం చేస్తున్న ప్రధాని మోడీ అధికార పీఠం ఊడటం ఖాయమని బీపీ మండల్ మనవడు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ అన్నారు. దేశంలో సగానికి పైగా ఉన్న ఓబీసీల కోసం పోరాటం చేసేందుకు ధైర్యంగా ముందుకొచ్చిన కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి కావటం ఖాయమన్నారు. ఓబీసీలకు న్యాయం జరగాలంటే పోరాటం చేయాల్సిందేనని చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్ లో ఉన్న అధికారుల్లో, కీలకమైన పోస్టుల్లో ఒక్కరూ కూడా ఓబీసీలు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీలకు ఈ ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యం ఏంటో గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు బీసీలను 42 ఏళ్ల పాటు మోసం చేశాయని తమిళనాడుకు చెందిన రైట్స్ ఆఫ్ ఓబీసీ పార్టీ అధ్యక్షుడు తిరు రత్న సభాపతి ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలకు వారి వాటాకు అనుగుణంగా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. సభలో దేశ వ్యాప్తంగా ఓబీసీల కోసం పోరాటం చేస్తున్న నాయకులు యెజ్జురప్ప, ధర్మేంద్ర కుశ్వాహ, ఉమేశ్ కొర్రం సకల, గీతిక, సునీల్ వర్మ, రైజా బీబీ, బన్సీ లాల్ నీలం కుమారి, విశ్వజిత్ రతోనియా తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఓబీసీ డిక్లరేషన్ లోని అంశాలు

- దేశ వ్యాప్తంగా జనగణన చేపట్టాలి, అందులో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి
- ప్రతి కులానికి ప్రత్యేకంగా యూనిక్ కోడ్ ఉండాలి
- ఓబీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా ఇవ్వాలి
- 1931 జనగణన ప్రకారం బీసీల జనాభా 52 శాతం.. దానికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు 50 శాతం ఉండాలి
- 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్ తీసేయాలి, 50 సీలింగ్ కారణంగా బీసీలకు నష్టం జరుగుతుంది
- బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలి
- విశ్వ విద్యాలయాల్లో సోషల్ జస్టిస్ ఉండాలి
- ప్రైవేట్ సెక్టార్ లో రిజర్వేషన్లు అమలు చేయాలి
- 42 శాతం తెలంగాణలో, మధ్యప్రదేశ్ లో 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

'తెలంగాణ రక్షణ సేన'లో చేరిన నరసింహారెడ్డి



ఇది కద నిజం,రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ కీలక నేత నరసింహారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి, 'తెలంగాణ రక్షణ సేన' పార్టీలో చేరారు. ఈ చేరిక కార్యక్రమం నీరుడు సర్వేష్ ముదిరాజ్, నవీన్ గౌడ్ నేతృత్వంలో జరిగింది. పార్టీ కండువా కప్పి నరసింహారెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని 123వ డివిజన్, హైదర్ షాకోట్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో నరసింహారెడ్డి మాట్లాడారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన పచ్చ జెండాను ఎగురవేస్తామని, 'పంచజన్యం' కార్యక్రమాన్ని ప్రతీ గడపకూ తీసుకెళ్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామని వెల్లడించారు.

యాదాద్రిలో నేత్రపర్వంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం



ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం స్వామి వారికి సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణోత్సవం జరిపించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులు స్వయంభువుడిని దర్శించుకున్నారు.



స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పిన అర్చకులు తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేశారు.

ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సమక్షంలో పసుపు తీర్థం పుచ్చుకున్న పుట్లగట్లగూడెం వైసీపీ నాయకులు!



ఇది కద నిజం: జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన వైసీపీ యువ నాయకుడు మల్లెపూడి రవి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరి పసుపు తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మల్లెపూడి రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పనితీరుకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, వాతావరణం అనుకూలిస్తే రేపు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరరావు సమక్షంలో పుట్లగట్లగూడెం గ్రామం నుంచి వందలాది కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని తెలిపారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సాదరంగా స్వాగతం పలుకుతూ, అందరం కలిసికట్టుగా పనిచేసి చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుట్లగట్లగూడెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శీలం వెంకటరాజు, శీలం కృష్ణంరాజు, గ్రామ బూత్ కన్వీనర్ మద్దాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 29-10-2026

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఏసీబీ మెరుపు దాడి

- రూ.20 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్



ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. పెట్రోల్ బంకు అనుమతుల వ్యవహారంలో రూ.20 వేల లంచం తీసుకుంటున్న లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం. పెట్రోల్ బంకు అనుమతుల కోసం లంచం డిమాండ్. కలెక్టరేట్‌లోని లీగల్ మెట్రాలజీ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు, పెట్రోల్ బంకు అనుమతుల వ్యవహారంలో చింతల యాదగిరి అనే వ్యక్తిని లంచం కోసం డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో వల పన్నారు. ఈ క్రమంలో చింతల యాదగిరి నుంచి మొదటి విడతగా రూ.20 వేల నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లును పట్టుకున్నట్లు సమాచారం. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు తదుపరి చర్యలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

తుర్కపల్లి మండలంలో పైపులైన్ పగిలి రోడ్డుపాలవుతున్న భగీరథ నీరు

ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి జిల్లా: తుర్కపల్లి మండలంలో ఒకవైపు కరువు కష్టాలు మరోవైపు తాగునీటి కోసం తిప్పలు ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కా ఎంతో విలువైనది. కానీ, యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విలువైన తాగునీరు వృథాగా పోతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుర్కపల్లి ప్రధాన ట్యాంకు నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే ప్రధాన మిషన్ భగీరథ పైపులైన్ పదేపదే పగిలిపోతుండటంతో వేల లీటర్ల నీరు రోడ్డుపై, పొలాల్లోకి ప్రవహిస్తోంది. ఇప్పటికే పంటల సాగు కోసం నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పైపులైన్ నుంచి ఉధృతంగా వస్తున్న నీరు మరో సమస్యగా మారింది. వరి పొలాల్లోకి నీరు చేరడంతో పంటలు దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలకు.. క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు మధ్య వ్యత్యాసం ఇదేనా? ఒకవైపు ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యం మరోవైపు ప్రజలకు అందాల్సిన నీరు ఇలా వృథా కావడం ఎంతవరకు సమంజసం? పైపులైన్ పగిలిన ప్రతిసారీ తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే సమస్య మళ్లీ మళ్లీ పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం నీటి వృథా సమస్య మాత్రమే కాదు.. ప్రజాధనానికి నష్టం, రైతుల పంటలకు ముప్పు, భవిష్యత్తులో తాగునీటి సరఫరాకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తారా? నాణ్యమైన పైపులతో శాశ్వత మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికడతారా?

రక్తదానంతో అమరవీరులకు ఘన నివాళి!

- పోలీసు అమరవీరుల సంస్మరణలో యాదగిరిగుట్ట పోలీసుల సేవా కార్యక్రమాలు
- 2కే రన్‌తో ప్రజల్లో అవగాహన



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో యాదగిరిగుట్ట జోన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. జోన్ డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా రక్తదానం ప్రాణదానంతో సమానమనే సందేశాన్ని చాటిచెప్పారు. అమరులైన పోలీసుల సేవలను గుర్తుచేసుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, యువత పాల్గొన్నారు. ప్రజాసేవలో పోలీసుల పాత్రను మరింతగా చాటిచెప్పడంతో పాటు, సామాజిక బాధ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2కే రన్‌ను కూడా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ భాస్కర్, రూరల్ సీఐ శంకర్ గౌడ్, ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్ రావు, ఎస్ఐలు యాదయ్య, ప్రసాద్, ఇంద్రారెడ్డి, రూపశ్రీ, ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, పోలీసు సిబ్బంది, కానిస్టేబుళ్లు, యువత తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 'నశా ముక్త్ భారత్ అభియాన్'

విద్యార్థులతో భారీ ర్యాలీ



ఇది కద నిజం, యాదాద్రి భువనగిరి జిల్లా: తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి అధ్యక్షతన యాదగిరిగుట్టలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కూడిన భారీ ర్యాలీ పుర వీధులలో నిర్వహించి తదుపరి స్థానిక విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో నిర్వహించిన సమావేషంలో చైర్మన్ సద్ది వెంకటరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని, వ్యసనాలకు ఎవరు బానిసలు కాకూడదని అని అన్నారు. ఆరోగ్యవంతమైన యువత దేశానికి గొప్ప సంపదని అందువల్ల యువత ఎవరు పెడదారి పెట్టకూడదని తెలియజేశారు. తదుపరి ఈ సమావేశంలో పాల్గొన్న వారి అందరితో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కొరకు పాటు పడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఆ తదుపరి 11.00 గంటలకు గవర్నర్ లైవ్ కార్యక్రమం అందరు వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్య నిర్వాహక సభ్యులు జంపాల అంజయ్య , ఐలేని రాంరెడ్డి, ఇమ్మడి రామచంద్రారెడ్డి, మేకల వెంకటేశ్వర రెడ్డి, మామిండ్ల అమరేందర్ రెడ్డి బహుపేట సర్పంచ్ కవిడె మహెందర్, మెతుకు భాస్కర్ రెడ్డి, గోపాల యాదగిరి, విజ్ఞాన్ స్కూల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

యాదగిరిగుట్ట ప్రధాన అర్చకులు శ్రీ బట్టార్ సురేంద్ర ఆచార్యకు 'ప్లాటినం ఐకాన్--2026' అవార్డు ప్రదానం



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: ఉజ్వల శిఖరము ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు బట్టార్ సురేంద్ర ఆచార్యకి 'ప్లాటినం ఐకాన్--2026' అవార్డును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక రంగంలో సేవలందిస్తున్న ప్రధాన అర్చకులు బట్టార్ సురేంద్ర ఆచార్యకి ఈ అవార్డు ప్రదానం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ రెమిడీస్‌కు చెందిన నరసింహ తాంత్రి, లక్ష్మి, సతీష్ యాదవ్, పెండెం శ్రీనివాస్ గురుస్వామి, బాలరాజు, నరసింహరావు, పూల గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- పిట్లం ఎస్సై బి. ఆంజనేయులు





ఇది కద నిజం, నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో పోలీసు శాఖ వారి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బి. ఆంజనేయులు మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, ఆరోగ్యం, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, మంచి మార్గంలో నడవాలని సూచించారు. మత్తు పదార్థాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్లం ఎస్ఐ బి. ఆంజనేయులు మండల విద్యాధికారి దేవి సింగ్, మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు, లైన్స్ క్లబ్ వారు, వివిధ పాఠశాల హెడ్మాస్టర్లు, విద్యార్థి విద్యార్థులు, తదితరు లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కలెక్టర్ కీలక ఆదేశాలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో నిర్ణయించారు. జాతీయ రహదారులైన ఎన్‌హెచ్--44, ఎన్‌హెచ్--161 వెంట ఉన్న అక్రమ దాబాలు, ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడే వారికి కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకం కింద రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందేలా ప్రజలు ముందుకు రావాలని సూచించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎల్ నినో ప్రభావంపై రైతులకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచనలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జుక్కల్: రైతులతో ముచ్చటించిన జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఎల్ నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో సాగు చేస్తున్న పంటల పరిస్థితులను తెలుసుకుని, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వరి సాగులో అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యామ్నాయంగా పొద్దుతిరుగుడు పంట సాగు అవకాశాలను పరిశీలించాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

బీజేపీ ఆలేరు ఎండోమెంట్ కన్వీనర్‌గా శ్రీనివాస్ గౌడ్





ఇది కద నిజం,యాదాద్రి భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ కన్వీనర్ సురకంటి జంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆలేరు అసెంబ్లీ ఎండోమెంట్ కన్వీనర్‌గా కళ్మెం శ్రీనివాస్ గౌడ్ నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావు చేతుల మీదుగా, ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సూర్య ప్రకాష్, జాయింట్ కన్వీనర్ రంగ రామ గౌడ్ ల సమక్షంలో శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, సంతోష్, విక్రమ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి- నేదురుమల్లి



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి (ఇది కద నిజం):- ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి మున్సిపాలిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజలు అండగా నిలవాలి అని చైర్‌పర్సన్ అభ్యర్థి బొలిగల దీవెనమ్మతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని వెంకటగిరి పట్టణంలోని పలు వార్డుల్లో సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి, బొలిగల మస్తాన్ యాదవ్‌తో కలిసి వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులకు అన్యాయం జరిగింది అని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా ఐదేళ్లపాటు అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.24 వేల ఆర్థిక సాయం అందించాం అని తెలిపారు.అదేవిధంగా 2023లో వెంకటగిరిలోనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతన్న నేస్తం పథకం అందించిన విషయాన్ని నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గుర్తు చేశారు.అదేవిధంగా ఐదేళ్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన టీడీపీ అభ్యర్థి దొంతు శారదమ్మ వెంకటగిరికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి అని అదేవిధంగా స్థానికత గురించి మాట్లాడే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు నేదురుమల్లి కుటుంబానికి వెంకటగిరితో ఉన్న అనుబంధం తెలియదా? అని బొలిగల మస్తాన్ యాదవ్ వెంకటగిరి వాసి అని నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు.అదేవిధంగ టీడీపీ అభ్యర్థిని గెలిపిస్తే పనుల కోసం నాయకుల చుట్టూ తిరగాలి.. దీవెనమ్మను గెలిపిస్తే ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరిస్తారు అని ఎమ్మెల్యే నివాసం ఉన్న వీధిలోనే చెత్త తొలగింపు, పారిశుధ్య నిర్వహణపై దీవెనమ్మ చూపిన చొరవే ఆమె కార్యాచరణకు నిదర్శనం అని తెలిపారు. అదేవిధంగా వెంకటగిరిని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రమణక్కపేటలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన రెవెన్యూ అధికారులు
-రేషన్ సేవల్లో ఆధునికతకు శ్రీకారం..



ఇది కద నిజం మంగపేట, అక్టోబర్ 28:

మంగపేట మండలం రమణక్కపేట గ్రామపంచాయతీలో బుధవారం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిపాలన అధికారి కన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఏసుపాదం పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ కార్డుల ప్రాధాన్యత, వాటి ద్వారా అందే ప్రజా పంపిణీ వ్యవస్థ సేవల గురించి వివరించారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ రావుల లలిత, పంచాయతీ సిబ్బంది గాజు నరసింహ రావు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

వర్షం కురిసినా వెనక్కి తగ్గని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు.. 16వ రోజుకు సమ్మె

- డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదు..
- ములుగులో గాంధీ విగ్రహం ఎదుట కొనసాగుతున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె



ఇది కద నిజం ములుగు, అక్టోబర్ 28:

ములుగు జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరసన సమ్మె బుధవారంతో 16వ రోజుకు చేరుకుంది. వర్షం కురుస్తున్నప్పటికీ ఉద్యోగులు వెనక్కి తగ్గకుండా సమ్మె దీక్షను కొనసాగిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మె కొనసాగించడం ద్వారా తమ సమస్యల పరిష్కారం పట్ల ఉద్యోగులు పట్టుదలతో ఉన్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చి న్యాయం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్ నరహరి, నవీన్, తరుణ్, శ్రీనివాస్, పార్వతి, లోకప్రియ, చందన, అనిత, భవ్య, సిద్ధ, రజిని, దివ్య, సైకాలజిస్ట్ కిరణ్ కుమార్, ఫార్మసీ అధికారులు నవీన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.